సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 1 । మే । 2023



బ్రహ్మయ్య పండుగ.. ఆనందం నిండుగ

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం భారీగా భక్తులు తరలివచ్చారు. -8లో..



ఆనందం పదిలం

కడపలోని రిమ్స్‌లో 2007 బ్యాచ్‌కు చెందిన 149 మంది వైద్య విద్యార్థులు ఆదివారం ప్రత్యేకంగా కలిశారు. తమ అనుబంధాలను పంచుకున్నారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.94
రెండోరకం	రూ.50	రూ.72

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 471 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	475	543
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1,161.92 కిలోలు

న్యూస్‌రీల్

నేడు స్పందన

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



రూ. లక్ష విరాళం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి అందజేస్తున్న దాతలు

కేవీపల్లె : వాల్మీకిపురం సాయి నారాయణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ. లక్ష విరాళం అందజేశారు. కేవీపల్లె మండలం నూతకాలువ పంచాయతీ ముప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన కోర్టు సుబ్బారెడ్డి రూ. 50 వేలు, వంకిరెడ్డిగారిపల్లెకు చెందిన యర్రంరెడ్డి రూ. 50 వేలు మొత్తం రూ. లక్ష విరాళం ఆదివారం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమంలో దాతలు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జయరామచంద్రయ్య, కిరణ్‌కుమార్‌నాయుడు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్టు పయనం



ఏపీ సీఎం కప్‌లో పాల్గొనే కబడ్డీ జట్టు

కడప స్పోర్ట్స్ : తిరుపతిలో మేనెల 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న ఏపీ సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా కబడ్డీ జట్టు పయనమైంది. ఆదివారం కడప లోని స్టెప్ కార్యాలయంలో క్రీడాకారులకు క్రీడాదుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ మాట్లాడుతూ పోటీల్లో జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రదర్శన కనబరచాలన్నారు. డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి. అమృత్‌రాజ్ మాట్లాడుతూ విజేతలుగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

నేటినుంచి రోడ్డెక్కనున్న ఎలక్ట్రిక్ బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వేసవిని దృష్టిలో పెట్టుకుని కడప–తిరుపతి మధ్య సోమవారం నుంచి నాన్‌స్టాప్ ఎలక్ట్రికల్ ఏసీ బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నగర మేయర్ సురేష్ బాబు, కడపజోన్ ఈడీ గోపినాథ్‌రెడ్డి, ఆర్‌ఎం గోపాల్‌రెడ్డిలు ఉదయం 11 గంటలకు కడప ఆర్టీసీ బస్టాండులో వీటిని ప్రారంభించనున్నారు. ఈ బస్సులు ప్రతిరోజు ఉదయం 4.30 నుంచి రాత్రి 7.30 వరకు ప్రతి గంటకు ఒకటి చొప్పున ఉంటాయి. పెద్దలకు రూ. 340, పిల్లలకు రూ. 260 ఛార్జిగా నిర్ణయించారు.

అంగన్‌వాడీ కేంద్రం.. ఆరోగ్య మణిహారం

- గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం
- రక్తహీనత నివారణకు సంపూర్ణపోషకాహార పథకం
- జిల్లాలో 2275 అంగన్‌వాడీ కేంద్రాలు
- జిల్లాలో 11,801 మంది గర్భిణులు, 11,654 మంది బాలింతలకు లబ్ధి
- ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి



అంగన్‌వాడీలో గర్భిణులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్: స్త్రీ,శిశుసంక్షేమ శాఖ ద్వారా నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలు ఆరోగ్యానికి మణిహారంగా మారాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం తనవంతుగా అన్ని విధాలా కృషి చేస్తోంది. అన్నమయ్య జిల్లాలో రక్తహీనతతో బాధపడే మహిళల కోసం వారి సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా ఐసీడీఎస్ సిబ్బంది పని చేస్తున్నారు. కేంద్రాల ద్వారా పాలు, గుడ్లు, మధ్యాహ్నభోజనం, సంపూర్ణపోషణ, వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ కిట్లను అందజేస్తున్నారు. ప్రతి కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకం ఒకటి. దీన్ని 2022లో ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలు, పిల్ల లకు పౌష్టికాహారాన్ని అందించడమే ఈ పథకం ఉద్దేశం. జిల్లాలో 0 నుంచి 6 సంవత్సరాలలోపు 1,09,444 మంది పిల్లలు, 11,801మంది గర్భిణులు, 11,654 మంది బాలింతలకు వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకం ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.

పోషక పదార్థాలపై అవగాహన

ఆహారంలో తీసుకోవాల్సిన పోషక పదార్థాలు, వాటికున్న విలువ గురించి అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, అధికారులు ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పదార్థాలు, వాటిలోని పోషక పదార్థాల నిష్పత్తిని వివరిస్తున్నారు. వారిని ఆయా పదార్థాలను వినియోగించేలా ప్రోత్సహిస్తున్నారు.

గుడ్డులో మంచి పోషక పదార్థాలు

కోడిగుడ్డులో మంచి పోషక పదార్థాలు ఉంటాయి. ప్రతిరోజు గుడ్డును తినాలని వైద్యులు సూచిస్తారు. అలాగే తల్లీబిడ్డలకు బలవర్థకమైన ఆహారం పాలు. ఆవు పాలకంటే గేదెపాలలోనే అధిక పోషకాలు ఉంటాయి. వీటితో పాటు నానబెట్టిన, మొలకెత్తిన విత్తనాలు, అత్యంత విలువైన పోషకాలున్న పాలకూర, రోగాలను హరించే శక్తి ఉన్న రాగులలోని పోషకాల గురించి గర్భిణులు, బాలింతలు, పసిపిల్లల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. వీటిని ఆహారంలో తీసుకునేలా ప్రోత్సహిస్తున్నారు.

వైఎస్‌ఆర్ సంపూర్ణపోషణ ప్లస్ వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు :	1858
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు :	417
మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు :	2275
గర్భిణులు :	11801
బాలింతలు :	11,654
3 సంవత్సరాలలోపు పిల్లలు :	68,369
3నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలు:	41,075



బలవర్థకమైన ఆహారం



నాపేరు ఎస్.ఆయేషా. నేను మదనపల్లె పరిధిలోని బొమ్మనచెరువు సెక్టార్ డ్రైవర్స్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణి గా పేరు నమోదు చేసుకున్నా ను. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పాలు, గుడ్లతో పాటు ఆరు రకాల బలవర్థక ఆహార పదార్థాలుండే వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ కిట్ తీసుకుంటున్నాను. గర్భిణీ దశలో సుఖప్రసవం నుంచి బిడ్డ 2 సంవత్సరాల ఎదుగుదల వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం



నాపేరు వర్ష. మదనపల్లె డ్రైవర్స్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో 3 నెలల గర్భిణిగా ఉన్న ప్పుడు పేరు నమోదు చేసుకున్నాను. అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్నం భోజనం తింటున్నాను. సంపూర్ణపోషణ కిట్‌ను తీసుకుని వినియోగించుకుంటున్నాను. ఫలితంగా శరీరంలో హిమోగ్లోబిన్ శాతం పెరిగింది. అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం, ఆశావర్కర్ల సలహాల మేరకు ప్రభుత్వ వైద్యశాలలో సుఖప్రసవం జరిగింది.

అంగన్‌వాడీలకు ప్రభుత్వ ప్రోత్సాహం



అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు చక్కటి ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ముఖ్యంగా వైఎస్‌ఆర్ సంపూర్ణ పోషణ పథకంలో రాగి, సజ్జ, జొన్న, అటుకులు, ఎండు ఖర్జూరం, బెల్లం, వేరుశనగచిక్కి వంటి బలవర్థకమైన ఆహారాన్ని గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్నాము. పోషకాహార విలువలను వివరిస్తున్నాం.

–ధనలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, అన్నమయ్య జిల్లా

ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి



గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యపరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆకుకూరల్లో ఐరన్, క్యాల్షియం సమృద్ధిగా ఉంటాయి. బాదం, ఖర్జూరం వంటి డ్రైఫ్రూట్స్‌ను నానబెట్టుకుని గర్భిణులు తినాలి. పాలు, గుడ్లు తప్పక తీసుకోవాలి. ప్రభుత్వం గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.

– గిరీషా పీఎస్, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

18 రోజులకే ఉద్యోగ విరమణ



వెంకటశివారెడ్డిని సన్మానిస్తున్న ఎంఈవో సురేంద్రబాబు తదితరులు

గుర్రంకొండ: 1998 డీఎస్సీలో ఉద్యోగం వచ్చిన ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు. కనీసం 62 సంవత్సరాల వయోపరిమితి ఉంటుందని భావించి 18 రోజుల కిందటే అన్నమయ్య జిల్లా గుర్రంకొండ సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకట శివారెడ్డి తన పదవికి రాజీనామా చేసి ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరాడు. అయితే ఉద్యోగ విరమణ వయస్సు 60 ఏళ్లకే కుదించారు. దీంతో ఆదివారం ఆయన పని చేస్తున్న దౌలత్‌ఖాన్‌పల్లెలో ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ చేశారు. ఈసందర్భంగా ఎంఈవో సురేంద్రబాబు ఆయనను సన్మానించారు. ఉపాధ్యాయుడిగా వెంకటశివారెడ్డి సేవలు అందరికి ఆదర్శనీయమన్నారు.కార్యక్రమంలో ఎల్లుట్ల రెడ్డికుమార్, హెడ్మాస్టర్ రమణమ్మ, ఉపాధ్యాయులు యనమల శేఖర్‌బాబు, ఎస్వీరమణ, ఎస్,వెంకట్రమణ, ప్రసన్నలక్ష్మీలు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మదిలో నుంచి పుట్టిన వ్యవస్థే గ్రామ, వార్డు సచివాలయాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశమందిరంలో గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కో చైర్మన్ లెక్కల జమాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. నాటి ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజలకు ఏదైతే మాట ఇచ్చారో దానికి కట్టుబడి అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే దేశంలోనే అత్యంత పెద్దదైన సచివాలయ వ్యవస్థకు రూపకల్పన చేసి అమలు చేశారన్నారు. సచివాలయ ఉద్యోగుల ఎంపికలో కూడా ఎలాంటి పైరవీలకు ఆస్కారం లేకుండా లక్షా 36 వేలమందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినట్లు చెప్పారు. సాక్షాత్తు దేశ ప్రధాని నరేంద్రమోదీనే ఈ వ్యవస్థను కొనియాడారన్నారు. ఇటీవల తాము జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రంలో భాగంగా నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేలో కోటి 45 కుటుంబాలను కలువగా, కోటి 10 లక్షల కుటుంబాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మద్దతు పలికాయన్నారు. ఇందుకు ప్రధాన కారణం సచివాలయ ఉద్యోగులు అందించే తోడ్పాటే అన్నారు.

- ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకమరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇప్పర్తి నిఖిల్‌కృష్ణ, అడిషనల్ జనరల్ సెక్రటరీ బీఆర్ కిశోర్; రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి మధు, జిల్లా అధ్యక్షుడు పెంచలయ్య, ఏపీజీఈఎఫ్ చైర్మన్ శివారెడ్డి, కో చైర్మన్ వల్లం సుబ్బారెడ్డి, శివశేషాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి కేజీసెట్ -2కే23 పరీక్ష

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని కేఎస్‌ఆర్‌ఎం, కేఎల్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల వారు మే 1వ తేదీ నుంచి 4 వరకు ఆన్‌లైన్‌లో కేజీసెట్-2కే23 నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ వీఎస్ఎస్‌మూర్తి తెలిపారు. రోజుకు రెండు విడతల్లో జరిగే పరీక్షకు రాయలసీమలోని వివిధ జిల్లాల నుంచి 5,000 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. కేజీసెట్ 2కే23ని ఏపీ ఎంసెట్ తరహాలో ఉన్నత ప్రమాణాలతో నిర్వహిస్తామన్నారు. ఇంకా ఎవరైనా రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకుని పరీక్షకు హాజరుకావచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి(నాని) అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, కేజీసెట్ -2కే23 కన్వీనర్ కిషోర్‌కుమార్, కళాశాల అడ్మిషన్ కమిటీ డీన్ రామోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌సీసీ ఉద్యోగుల సంఘం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎన్‌సీసీ ఉద్యోగుల సంఘం నాయకులు

వైవీయూ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఎన్‌సీసీ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో జిల్లా ఉద్యోగులకు ప్రాధాన్యత దక్కింది. ఆదివారం తిరుపతి నగరంలో ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన ఎన్నికల్లో కడప 30 ఆంధ్రా బెటాలియన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చల్లా రాజగోపాల్‌రెడ్డి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయనతో పాటు కడప 30 ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్. సరస్వతి, ఉపాధ్యక్షులుగా కె. అంకయ్య, సంయుక్త కార్యదర్శిగా ఎం. గౌస్‌బాషాలను ఎన్నుకున్నారు. వీరిని ఎన్‌సీసీ బెటాలియన్ సిబ్బంది, ఏఎన్‌ఓలు అభినందించారు.

మిరప పంట వర్షార్పణం



వర్షంలో తడిసిన మిరప పంట

జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు మండలం ఎస్. ఉప్పలపాడు గ్రామంలో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు ఆరబెట్టిన మిరప పంట పూర్తిగా తడిసిపోయిందని రైతు నల్లంశెట్టి పెద్ద నారాయణ వాపోయాడు. రైతు తనకున్న 4 ఎకరాల భూమిలో '' డబ్బి బ్యాడిగి అనే రకం మిరప పంట''ను సాగు చేశాడు. వచ్చిన 25 క్వింటాళ్ల మిరప పంటను రైతు పొలంలో ఆరబెట్టాడు. శనివారం రాత్రి భారీ వర్షం పడటంతో పొలంలో ఆరబెట్టిన మిరప పంట అంతా తడిసిపోయింది. ఈ రకం మిరప పంట కర్ణాటక రాష్ట్రం హుబ్లీ బ్యాడిగి మార్కెట్‌లో క్వింటా రూ. 60 వేలు ధర పలుకుతుందని రైతు తెలిపాడు. మిరప పంట తడిసి పోవడంతో దాదాపు రూ. 10 లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరాడు.

బంధాలు వివరించి.. బాధ్యత గుర్తించి

SAKSHI SPECIAL

- సెలవుల్లో కుటుంబ అనుబంధాలను పిల్లలకు తెలియజేయాలి
- మానవత్వం.. రక్త సంబంధాలను స్పృశించాలి
- తల్లిదండ్రులదే బాధ్యత అంటున్న నిపుణులు

మదనపల్లె సిటీ: విజ్ఞానం కోసం చదువు.. శారీరక ఆనందం కోసం వ్యాయామం, మానసిక ప్రశాంతత కోసం యోగా, ఇలా మనిషి జీవితం ఒక్కో అంశానికి ఒక్కో మార్గాన్ని వెతుక్కుంటోంది. కానీ అపార్టుమెంట్ జీవితాలకు అలవాటు పడుతున్న పట్టణ, నగరాలకు చెందిన చిన్నారులు.. చిన్న కష్టానికే జీవితానికి సరిపడే నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఉన్నత విద్యావంతులైనా... ఒత్తిడికి చిత్తవుతూ.. మానసిక రుగ్మతలకు గురవుతున్నారు. చివరి కాలంలో కనీసం తల్లిదండ్రులను కూడా పట్టించుకోనంతటి నిర్దయను ప్రదర్శిస్తున్నారు. దీనికంతటికి ప్రధాన కారణం ఉమ్మడి కుటుంబాలు కరువవడం, పైగా చిన్నప్పటి నుంచి రక్తసంబంధాలు, అనుబంధాలను ఆత్మీయంగా స్పృశించకపోవడమే. అందుకే సెలవులకు ఇంటికొచ్చిన చిన్నారులకు.. తల్లిదండ్రులు తమ రక్తసంబంధీకుల సమాచారాన్ని .. సమాజ బాధ్యతలను తెలియజేయాలంటున్నారు మానసిక నిపుణులు.

- వేసవి సెలవులు ఇచ్చేశారు. పిల్లలు ఇంటి పట్టున ఉండే సమయం ఇది. ఇన్నాళ్లు.. చదువుల కోసం తల్లిదండ్రులకు దూరంగా ఉన్నారు. వారితో బంధువులు, కుటుంబ సభ్యులు గడిపే సమయం చాలా తక్కువ ఉంటోంది. ఇక పరీక్షలు రాశాక సొంత ఊళ్లల్లో గడపాలనే ఉత్సాహంతో వస్తారు పిల్లలు. సెలవుల్లో వారి ఆటాపాటలకు వదిలిపెట్టడమే సరిపోదు. వారి వ్యక్తిత్వ వికాస అభివృద్ధి కోసం సమయం కేటాయించాల్సిన సమయం ఇదేనని తల్లిదండ్రులు గుర్తించాలి. కన్నవారితో ..రక్తసంబంధీకులతో.. బంధువులతో..ప్రేమానుబంధాలను పెంచే విధంగా ఈ కొద్ది రోజుల్లోనే తమ వంతు ప్రయత్నాలు చేయాలి. విద్య విషయంలో ఎలా శ్రద్ధ తీసుకుంటున్నారో వారి బుద్ధి వికాసాల్లో (వ్యక్తిత్వ వికాసం) అంతే శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. వ్యక్తిత్వ వికాసం లేకుంటే వారి భవిష్యత్తులో ఎదురయ్యే జీవన సవాళ్లలో వారికి ఇబ్బందులు తప్పదు.



అనుబంధమంటే ...అర్థం చెప్పాలి

వృద్ధులైన తల్లిదండ్రులను పట్టించుకోని సంతానం ..ఆస్తి కోసం అన్నదమ్ముల కొట్లాటలు... అక్కాచెల్లెళ్ల తగవులు.. బంధువులతో వైషమ్యాలు, సమాజంలో తోటివారితో ఘర్షణలు.. ఇలాంటి కలవరపరిచే వార్తలు కోకొల్లలుగా నిత్యం దర్శనమిస్తున్నాయి. వీటంతటికి కారణం వ్యక్తిత్వ వికాసం లోపమే. క్షణం ఆలోచించే నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితులే ఈ బంధాలు తెగిపోవడానికి కారణమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లల పెంపకంలో వ్యక్తిత్వ నిర్మాణం అనేది తల్లిదండ్రుల ముందున్న సవాల్‌గా గుర్తించాలి. ఈ విషయంలో నిర్లక్ష్యం జరిగితే వారు పెద్దయ్యాక తమ పట్లనే కాదు. తోటివారితోనూ మానవత్వం లేకుండా ప్రవర్తించే అవకాశం ఉందనే అభిప్రాయం ఉంది. ఈ నేపథ్యంలో బంధం..అనుబంధమంటే ఏమిటో వారికి స్పష్టంగా తెలియజేయాలి. దాని అర్థాన్ని వివరించాలి.

బంధువులతో మెలిగేలా..

గతంలో పిల్లలు సెలవుల్లో అమ్మమ్మ ఇంటికో లేదా ఇతర బంధువుల ఇళ్లకో వెళ్లి గడిపేవారు. సెల్‌ఫోన్లు వచ్చాక పిల్లలు చుట్టాల ఇళ్లకు వెళ్లేందుకు ఆసక్తి చూపడటం లేదు. బంధువులు వస్తే వారితో తమకు గల బంధుత్వం ఏమిటో కూడా తల్లిదండ్రులు చెప్పేదాక గుర్తించలేని పరిస్థితి. ఇంటికి ఎవరు వచ్చినా లేదా బంధువుల ఇంటికి వెళ్లినా.. ఆంటీ, అంకుల్ అని మాత్రమే పిలవడం తప్ప వారి పేరు ఏమిటి.. ఏ వరుస అవుతారు..అనే విషయాలే తెలియడం లేదు. బంధువుల ఇళ్లలో ఏదైనా కార్యక్రమానికి తల్లిదండ్రులతో కలిసి వెళ్లినా ముభావంగానే ఉంటూ బంధుత్వంలో ఉండే ఆప్యాయత, అనురాగాలకు దూరమవుతున్నారు. తమ చుట్టూ కుటుంబాల్లో ఉన్న సమస్యలు ఏమిటి? వాటిని ఎలా వారు పరిష్కరించుకుంటున్నారు ఇలాంటి సమస్యలే ముందు తమ జీవితాల్లో ఎదురైతే ఎలా ఎదుర్కోవాలి అనే విషయాలపై అవగాహన లేకుండా ఉంటున్నారు. తల్లిదండ్రులు ఈ విషయాల్లో తమ పిల్లలను చైతన్య పరచాల్సిన అవసరం ఉంది.

బంధాలు తెలియకుంటే సమాజంలో నిలబడలేరు



పిల్లలను అనుబంధాలు, బాంధవ్యాలకు దూరంగా పెంచితే వారు భవిష్యత్తులో సమాజంలో నిలబడలేరు. వారి స్థానం కూడా కోల్పోతారు. పలు సమస్యలను, సవాళ్లను పరిష్కరించుకోలేరు. ప్రేమ, ఆత్మీయతలను, అనురాగాలను వారికి పంచివ్వాలి. ఆత్మీయ బాంధవ్యాలకు దూరమైతే దీర్ఘకాలంలో ఆ ప్రభావం ఉంటుంది. సెల్‌ఫోన్ యుగంలో అనుబంధాలకు వారు క్రమంగా దూరం కాకుండా తల్లిదండ్రులు వారికి తప్పనిసరిగా సమయం కేటాయించాలి. ఇలా చేయకపోతే ఆ ప్రభావం కుటంబ వ్యవస్థపైనే కాదు సమాజంపైనా పడుతుంది.

– జింకల మోహన్‌వల్లి, రచయిత్రి, అధ్యాపకురాలు, మదనపల్లె

సామాజిక అవసరాల ప్రాముఖ్యత తెలియజేయాలి



పిల్లలకు సామాజిక సంబంధాల అవసరాన్ని, ప్రాముఖ్యాన్ని తెలియజేయాలి. జీవనం అంటే కేవలం తమ కుటుంబ సభ్యులతో కలిసి సాగడమనే భావన మాత్రమే కాదు. మానవుడు సంఘ జీవి అనే వాస్తవాన్ని వారికి బాల్యదశలోనే స్పష్టంగా అర్థమయ్యేలా తెలపాలి. దీని వల్ల తోటివారికి సాయపడటం, మానవతా దృక్పథం, సమష్టి కృషి లాంటి విశాల భావనలు పెరగడానికి ఆస్కారం ఏర్పడుతుంది. దీంతో బాధ్యతగల, మానవీయ విలువలు గల భావి పౌరులుగా ఎదగడానికి అవకాశం ఉంటుంది.

–చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె

క్లుప్తంగా

మైదుకూరు మేజిస్ట్రేట్‌గా వీరవరప్రసాద్



రాజంపేట : మైదుకూరు స్పెషల్ జ్యుడిషియల్ (సెకండ్ క్లాస్) మేజిస్ట్రేట్‌గా రాజంపేట పట్టణానికి చెందిన పసుపులేటి వీరవరప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో వెలువరించింది. రాజంపేట బార్ అసోసియేషన్ సభ్యునిగా, న్యాయవాదిగా కొనసాగుతున్నారు. ఈయన పదవి 2024 మార్చి 31 వరకు మాత్రమే కొనసాగుతుంది. ఈయన ఎంపిక పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పుంగనూరులో దొరికిన ఇషాక్



పుంగనూరులో బాలుడితో ఎస్‌ఐ

బి.కొత్తకోట : స్థానిక సింహంవీధికి చెందిన మహమ్మద్ ఇషాక్ (12) శనివారం రాత్రి చిత్తూరు జిల్లా పుంగనూరులో దొరికాడు. శుక్రవారం సాయంత్రం ఇంటికి వెళ్తూ మార్గమధ్యలో మిత్రుని ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన ఇషాక్ అదృశ్యమయ్యాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. ఇషాక్ అదృశ్య సమాచారం సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరగడంతో పుంగనూరులో సంచరిస్తుండగా అంజుమన్ కమిటీ ప్రతినిధులు గుర్తించారు. విషయాన్ని పోలీసులకు చేరవేయడంతో ఎస్‌ఐ రామ్మోహన్ పుంగనూరుకు వెళ్లి ఇషాక్‌ను తీసుకొచ్చి కుటుంబీకులకు అప్పగించారు. అదృశ్యమైన సమయంలో బాలుడు ఇంటికి వెళ్లకుండా మదనపల్లె బస్సు ఎక్కి వెళ్లిపోయాడు. అక్కడి నుంచి పుంగనూరు చేరుకున్నాడు. అక్కడ రోడ్డుపై సంచరిస్తుండగా గుర్తించారు. వెళ్లడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

గాయపడ్డ మహిళ మృతి

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ ఆదివారం తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లెకు చెందిన వెంకటరమణ, నాగమ్మ దంపతులు కొంతకాలం కిందట ఉపాధి నిమిత్తం మదనపల్లె మండలం మొలకలదిన్నె క్రాస్‌కు వలస వచ్చారు. అక్కడ అద్దె ఇంటిలో ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో ఏప్రిల్ 24వ తేదీన మదనపల్లెలో పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తుండగా మార్గంమధ్యలో ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో భర్త వెంకటరమణ అక్కడికక్కడే దుర్మరణం పాలవగా నాగమ్మ తీవ్రంగా గాయపడి విషమ పరిస్థితికి చేరింది. దీంతో కుటుంబ సభ్యులు బాధితురాలిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రూయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు పొందుతూ పరిస్థితి విషమంగా మారడంతో మృతి చెందింది. ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు.

బ్రహ్మయ్య పండుగ.. ఆనందం నిండుగ

- కనుల పండువగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- బ్రహ్మంగారిమఠానికి పోటెత్తిన భక్తజనం
- మార్మోగిన 'బ్రహ్మ'నామస్మరణ



దీక్షబంధనాలంకారోత్సవంలో దర్శనమిస్తున్న స్వామి వారు



బ్రహ్మంగారిమఠంలో భక్తజన సందడి



క్యూలైన్‌లో బారులు దీరిన భక్తులు

బ్రహ్మంగారిమఠం : శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి పండుగను భక్తజనం ఆనందంగా జరుపుకొన్నారు. బ్రహ్మంగారు క్రీ.శ.1693నకు సరియగు శ్రీముఖ నామ సంవత్సర వైశాఖ శుద్ధ దశమి నాడు సజీవ సమాధి నిష్ట వహించారు. అప్పటి నుంచి ఈ ఏటా ఈ రోజును భక్తులు పర్వదినంగా జరుపుకొంటున్నారు. ఈ ఏడాది ఆదివారం ఉమ్మడి జిల్లాల్లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాల్లో వేడుకలు నిర్వహించారు. ప్రధానంగా స్వామి సజీవ సమాధి నిష్ట వహించిన ప్రాంతమైన బ్రహ్మంగారిమఠంలో ఈ సందర్భంగా ఆరాధన గురుపూజోత్సవాలు నాలుగు రోజుల నుంచి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తజనం తరలి వచ్చారు. క్యూలైన్‌లు కిటకిటలాడాయి. 'శరణమయ్యా.. బ్రహ్మయ్యా'.. 'మీ దరికి చేరామయ్యా.. మమ్మల్ని దీవించయ్యా..' అంటూ వారు వేడుకున్నారు. స్వామి సజీవ సమాధిని దర్శించుకుని తరించారు. వీరబ్రహ్మేంద్రస్వామి నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. బ్రహ్మంగారిమఠంలో ఎక్కడ చూసినా భక్తజనం కనిపించారు.

కమనీయంగా దీక్షాబంధనాలంకారోత్సవం

తెల్లవారుజామున శ్రీవీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్ధన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలలో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. మధ్యా హ్నం దీక్షబంధనాలంకారోత్సవాన్ని కనుల పండువగా జరిపారు. స్వామి యోగా నిద్రలో ఉన్న అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి సజీవ సమాధి నిష్ట వహించిన సందర్భాన్ని పురస్కరించుకుని దీక్షలో దర్శించే అలంకరణను దీక్ష బంధనాలంకారోత్సవం అంటారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. అక్కడ చిన్న మఠం మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్దమఠం చేరుకుంది. ప్రొద్దుటూరు నియోజకవర్గం వాసుదేవపురానికి చెందిన ఇరగంరెడ్డి మూలింటి నాగిరెడ్డి, ఆయన సతీమణి వెంకటమ్మ ఉభయదారులుగా వ్యవహరించారు. సాయంత్రం వేదపారాయణం చేశారు. అనంతరం కాలజ్ఞానంలోని కొన్ని తత్వాలను మఠం ఆస్థాన పండితులు పెదపాటి నాగేశ్వరరావు వివరించారు.

వైభవంగా నందివాహనోత్సవం

రాత్రి భక్తుల కాలక్షేపం కోసం హరికథ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నందివాహన గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి నంది వాహనంపై ఆశీనులను చేశారు. పెద్దమఠం నుంచి స్వామి నివసించిన ఇంటి వరకు గ్రామోత్సవం నిర్వహించారు. అక్కడ పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం కందిమల్లయ్యపల్లె పుర వీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. అనంతరం ఊరేగింపు తిరిగి పెద్దమఠం చేరుకుంది. ఉత్సవానికి కమలాపురం నియోజకవర్గం పెద్దపుత్తకు చెందిన తాడిగొట్ల వీరారెడ్డి, నారాయణరెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు. అన్నదానాలు, మజ్జిగ, వాటర్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాలను దాతలు పెద్ద ఎత్తున చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం సంగీత కళాశాలకు చెదిన విద్యార్థులు త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. ఉత్సవాల్లో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్యస్వామి, గోవింద స్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజి, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి, సిబ్బంది, స్వామి శిష్యులు ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. మైదుకూరు డీఎస్పీ మురళీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ నరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు స్థానిక ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపారు.

నేడు బ్రహ్మ రథోత్సవం

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల్లో ఐదో రోజైన సోమవారం సాయంత్రం 4 గంటలకు బ్రహ్మ రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు అధికారులతోపాటు మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి హాజరు అవుతున్నారని నిర్వాహకులు తెలిపారు.

ఈశ్వరీదేవిమఠంలో..

జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో జేజినాయన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రభాతసేవ, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం జరిగిన గుడి ఉత్సవం భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం, రాత్రి నైవేద్యం, మంత్రపుష్ప, నీరాజన తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. సాయంత్రం భక్తగాన లహరి, వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు. రాత్రి సింహ వాహన గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి ఆధ్వర్యంలో ఆలయ ఈఓ. బీవీ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు.



ఉపన్యాస కార్యక్రమంలో శ్రీ వెంకటాద్రిస్వామి, గోవిందస్వామి



నృత్యం చేస్తున్న కళాకారులు

నిరపరాధులను విధుల్లోకి తీసుకోండి

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీలో బెరైటీస్ ఖనిజం దొంగతనం విషయంలో దోషులను శిక్షించి నిరపరాధులైన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని సీపీఓ వెంకటరమణకు ఏపీఎండీసీ అవుట్‌సోర్సింగ్ అండ్ ట్రయిని కార్మిక పోరాట యూనియన్ ఉద్యోగ సంఘం నాయకులు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యునియన్ నాయకులు ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ ఏపీఎండీసీలో బెరైటీస్ దొంగతనం విషయంలో యాజమన్యం ఐదుగురు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఒక రెగ్యులర్ కార్మికుడిని విధుల నుంచి తొలగించిందన్నారు. విచారణలో ఇద్దరు మాత్రమే అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ అయిందని, అయితే తక్కిన డీ శివప్రసాద్, కే గోవర్ధన్‌రెడ్డి, యూ రాజేష్, కే రామంజనేయులుకు ఎటువంటి సంబంధం లేదని అన్నారు.



సీపీఓకు వినతి పత్రం అందజేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

కార్యక్రమంలో ఏపీఎండీసీ వర్కర్స్ యూనియర్ జనరల్ సెక్రటరీ బండారు భాస్కర్, ఏపీఎండీసీ అవుట్‌సోర్సింగ్ అండ్ ట్రయినీ కార్మిక నాయకులు పీ దేవకుమార్‌రెడ్డి, ఎం చంద్రశేఖర్, పీ ఈశ్వరయ్య, జీ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

రాజంపేట : పుల్లంపేట మండలం అన్నాసముద్రం గ్రామానికి చెందిన వెలగచెర్ల పెంచలయ్య ఆటో డ్రైవర్‌గా తన నిజాయితీని చాటుకున్నారు. రాజంపేట పట్టణ పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి సమక్షంలో ఆదివారం బాధితుడు నరసింహులు పోగొట్టుకున్న నగల బ్యాగును అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని విద్యుత్ నగర్‌కు చెందిన నరసింహారావు హైదరాబాదు నుంచి రాజంపేట వచ్చారు. పాత బస్టాండులో పెంచలయ్య ఆటో ఎక్కి ఇంటికి వెళ్లాడు. అయితే ఆటోలో రూ.3 లక్షలు విలువజేసే నెక్లెస్, ఐదు గ్రాముల జత కమ్మలు, ఒరిజినల్ సర్టిఫికెట్లు కలిగిన బ్యాగును మరిచి పోయారు. ఆటో డ్రైవర్ బ్యాగును గుర్తించి ఏఎస్‌ఐ వర్మకు అందజేశారు. ఎస్‌ఐ బ్యాగు పోగొట్టుకున్న వ్యక్తిని పిలిపించి విచారించి అప్పగించారు. ఆటో డ్రైవర్ నిజాయితీని అభినందించారు. నగదు రివార్డు అందజేశారు.



బాధితుడికి బ్యాగును అందజేస్తున్న ఎస్‌ఐ

కేవీకేలో మన్ కీ బాత్ ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమం

కడప అగ్రికల్చర్ : కృషి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రపంచ వ్యాప్తంగా ప్రసారమయ్యే మన్ కీ బాత్ ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు గ్రామాల నుంచి 80 మంది రైతులతో పాటు కేవీకే శాస్త్రవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా దేశ నలుమూలల్లోని ప్రజలలో ఉన్న నైపుణ్యాలను, కర్తవ్య దీక్షను, దేశానికి వారు చేస్తున్న సేవలను వెలుగులోకి తెచ్చి తద్వారా మిగిలిన వారిలో చైతన్యం కలిగించారన్నారు. దేశంలోని స్వయం సహాయక బృందాల విజయాలు, నూతన ఆవిష్కరణలు, ఆత్మ నిబ్బర భారత్, నదుల పునరుద్ధరణ పరిరక్షణ, నారీ శక్తి, బేటి బచావో బేటి పడావో, ఏకో ఫ్రెండ్లీ టెర్రకోట కప్పుల తయారీ, మేక్ ఇన్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్, స్వచ్ఛభారత్, సమాజంలో మహిళా అభ్యుదయం వంటి అంశాలపై కూడా అవగాహన తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ, ప్రశాంతి పాల్గొన్నారు.

తప్పుడు డాక్యుమెంట్ల కేసులో ఒకరి అరెస్ట్

మదనపల్లె : తప్పుడు డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాలతో కోట్ల విలువైన స్థలాన్ని స్వాహా చేయాలని ప్రయత్నించిన కేసులో ఏ-2 నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మదనపల్లె మండలం పొన్నేటిపాళెం పంచాయతీలో సర్వే నంబర్ 420/10లోని భూమిని ఫోర్జరీ సంతకాలు, తప్పుడు డాక్యుమెంట్లతో నీరుగట్టువారిపల్లెకు చెందిన కట్టాసులోచన ఆక్రమించుకుందని అబ్బయ్యగారివీధికి చెందిన మార్వారి వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా వివిధ సెక్షన్ల కింద ఏ-1గా కట్టాసులోచన, ఏ-2గా మేకలచెరువు గోవిందు, ఏ-3గా తిరుపతికి చెందిన గాలి పూర్ణానందచౌదరి, ఏ-4గా గుండ్లూరి నారాయణరెడ్డి, ఏ-5,6లుగా పాకాల, పులివెందుల సబ్‌రిజిస్ట్రార్‌లు, ఏ-7గా డాక్యుమెంట్ రైటర్ ఆనంద్‌నాయుడు, ఏ-8 గుండిగలమోహన్, ఏ-9 నల్లమరి రమేష్, ఏ-10 వి.మునికుమార్, ఏ-11 పి.నివాస్, ఏ-12 ఎన్.నాగరాజ, ఏ-13గా సులోచన బంధువు వెంకటరమణ, ఏ-14గా మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేశామన్నారు. కేసుకు సంబంధించి నిందితుల కోసం గాలిస్తుండగా...ఏ-2 మేకలచెరువు గోవిందును శనివారం సాయంత్రం తట్టివారిపల్లె పంచాయతీలోని శ్రీవినాయకస్వామి గుడి ముందు అరెస్ట్ చేశామన్నారు. అనంతరం స్టేషన్‌లో గోవిందును విచారిస్తే.. మార్వారి వెంకటేష్‌కి చెందిన సర్వేనెం.420/10లోని భూమిని కాజేసేందుకు కట్టాసులోచన ఆమె అనుచరులైన గోవిందు, తిరుపతికి చెందిన పూర్ణానందచౌదరి, నారాయణరెడ్డి, వెంకటరమణలతో కలిసి పాకాల, పులివెందుల, మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్‌లతో కుమ్మక్కై డాక్యుమెంట్ రైటర్‌లు ఆనంద్‌నాయుడు, నాగరాజులతో తప్పుడు డాక్యుమెంట్‌లు తయారు చేయించినట్లు తెలిపాడన్నారు. గుండ్లూరిమోహన్, నల్లామర్రిరమేష్, మునికుమార్, నివాస్‌లను సాక్షులుగా వాడుకుని వెంకటేష్‌కు చెందిన భూమిని కాజేసేందుకు కుట్ర పన్నినట్లు నేరం అంగీకరించాడన్నారు. ఈ కేసులో మిగిలిన నిందితులను త్వరలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతామని సీఐ సత్యనారాయణ తెలిపారు. తప్పుడు పత్రాలతో భూఆక్రమణలకు సంబంధించి మదనపల్లెలోని ఒకటో, రెండో, తాలూకా పోలీస్‌స్టేషన్‌లలో కట్టా సులోచనపై పలు కేసులు నమోదయ్యాయి. డీఎస్పీ కేశప్ప ఆధ్వర్యంలో మూడు స్టేషన్‌లలోనూ కట్టాసులోచనపై నమోదైన కేసులకు సంబంధించి పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. త్వరలో నేరంలో ప్రమేయం ఉన్న ప్రభుత్వ ఉద్యోగులతో సహా మిగిలిన వారందరినీ అరెస్ట్ చేయనున్నట్లు సమాచారం.

బలిజపల్లెలో పోటెత్తిన భక్తులు

రాజంపేట రూరల్ : భక్తుల కొంగు బంగారంగా ఉమ్మడి జిల్లాలలో వెలుగొందుతున్న బలిజపల్లె గంగమ్మతల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు పోటెత్తారు. స్థానిక బలిజపల్లెలోని గంగమ్మతల్లి స్వయంభు వద్దకు ఆదివారం ట్రాక్టర్‌లు, ఎడ్ల బండ్లు మీద భక్తులు తరలి వచ్చారు. ట్రాక్టర్, ఎద్దుల బండులను వేప మండలతో అలంకరించి, అరటి బోదెలను ఏర్పాటు చేసి బాణా సంచా పేలుస్తూ, తప్పెట్ల దరువులతో తమ గృహం నుంచి గంగమ్మ తల్లి వద్దకు చేరుకొని అమ్మవారి చుట్టూ మూడు ప్రదక్షణలు చేసి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించారు. గంగమ్మతల్లికి ఇష్టమైన వారం ఆదివారం కావడంతో వేకువజాము నుంచే వందల సంఖ్యలో భక్తులు తరలి రావడంతో బలిజపల్లి గ్రామం చిన్న పాటి జాతరను తలపించింది. జాతర చేస్తారో లేదో అని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నట్లు పలువురు భక్తులు తెలియజేశారు.



గంగమ్మతల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చక్రాయపేట : మండలంలోని ఎర్రబొమ్మనపల్లె గ్రామం కోలెకణం వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అజమతుల్లా(45) అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడి భార్య సుమీయ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కదిరి పట్టణానికి చెందిన అజమతుల్లా ఉదయం 5 గంటల సమయంలో తన ద్విచక్రవాహనంలో పెండ్లిమర్రి మండలం నందిమండలానికి తాటి ముంజల నిమిత్తం బయలుదేరాడు. కోలేఖనం వద్దకు రాగానే స్కూటీ అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో వ్యక్తి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మాలెపాడు గ్రామానికి చెందిన గూటం ఆదిత్య (31) అనే యువకుడు ఇంటిలో ఫ్యాన్‌కు చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కలమల్ల ఎస్‌ఐ శివప్రసాద్ ఆదివారం తెలిపారు. పెద్ద ఎత్తున అప్పులు చేసి వాటిని తీర్చలేక జీవితంపై విరక్తి చెంది ఇంటి మేడ మీద బెడ్ రూంలో ఆత్మహత్య చేసున్నాడు.

ఆనందం 'పది'లం

రిమ్స్ 2కె7 ఎంబీబీఎస్ బ్యాచ్ వైద్య విద్యార్థుల సమ్మేళనం



కడప రిమ్స్ వైద్య కళాశాల ఆవరణలో వైద్యులతో పాటు కలిసిన 2కె7 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్)లో 2007 (2కె7) బ్యాచ్‌లో 149 మంది వైద్య విద్యార్థులు ఎంబీబీఎస్‌లో చేరి, 2013లో పూర్తి చేశారు. వారంతా ఈనెల 29న, ఆదివారం ప్రత్యేకంగా కలిశారు. ఆదివారం కడప రిమ్స్ వైద్య కళాశాల ఆవరణంలో కలిసి అప్పటి కళాశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి వైద్య నిపుణులు, వైద్య అధ్యాపకులతో తమ అనుబంధాలను పంచుకున్నారు. 149 వైద్యులుగా బయటి ప్రపంచానికి వెళ్లిన వారంతా పీజీ వైద్యను పూర్తి చేసి వివిధ కేటగిరిలలో వైద్యవృత్తులను కొనసాగిస్తున్నారు. వారిలో 86 మంది రెండు రోజుల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ప్రస్తుతం ఈ బ్యాచ్‌కు సంబంధించిన వారు ఇండియన్ ఆర్మీలో ఏడుగురు డాక్టర్లుగా విధులను నిర్వహిస్తున్నారు. యు.ఎస్‌లో ఏడుగురు, యు.కెలో ఇద్దరు, ఒమన్‌లో ఒకరు, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో 8 మంది, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 26 మంది వైద్యులుగా విధులను నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రముఖ కార్పొరేట్ హాస్పిటల్స్‌లలో 70 మంది వైద్యవృత్తిలో వున్నారు. ఆదివారం కడప రిమ్స్‌లో నిర్వహించిన 'గెట్ టుగేదర్ ' కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన అప్పటి, ఇప్పటి వైద్యులు డాక్టర్ ఎస్.సీ ఓబులేసు, డాక్టర్ టి. గిరిధర్, డాక్టర్ ఎం.సురేశ్వర్‌రెడ్డి, డాక్టర్ జంగం వెంకటశివ, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ సంపత్, డాక్టర్ చంద్రబాబు, డాక్టర్ సునీల్, డాక్టర్ రమణయ్య, డాక్టర్ మృదుల, డాక్టర్ మదన్‌మోహన్, డాక్టర్ కోటకొండ మనోహర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ బ్యాచ్ హయాంలోనే డైరెక్టర్‌గా వున్న డాక్టర్ సిద్ధప్ప గౌరవ్ సహకారంతో అప్పటి వైద్యులందరి కృషితో జాతీయ స్థాయిలో రిమ్స్‌కు గుర్తింపు వచ్చేలా కడప రిమ్స్ మెడిఫెస్ట్, రిమ్స్ మెడికాన్ కార్యక్రమాలను నిర్వహించారు. ఆ తరువాతనే 2013 నుంచి రిమ్స్‌కు పీజీ సీట్లు మంజూరు కావడం ఆరంభమయ్యాయి.

సమిష్టి కృషితో అభివృద్ధి



కడప రిమ్స్‌లో 2007లో చేరి ఎంబీబీఎస్ విద్యను 2013లో పూర్తి చేశాం. పది సంవత్సరాల తరువాత ఇక్కడకు చేరి మా వంతుగా రిమ్స్‌కు, ప్రస్తుత వైద్య విద్యార్థులకు ఏమి అవసరమో చర్చించి అభివృద్ధికి సహకరిస్తాం. ఇక్కడ ఎంబీబీఎస్ పూర్తి చేసిన తరువాత ఛండీఘర్‌లోని పిజిఐఎంఈఆర్‌లో అనస్తీషియా అండ్ ఇన్సెంటివ్ కేర్‌లో పీజీని పూర్తి చేశాను. ప్రస్తుతం హైదరాబాద్‌లో క్రిటికల్ కేర్ కన్సల్టంట్‌గాను, చెన్నై ఏడిఆర్ ఫ్లెక్సాస్ అకడమిక్ డైరెక్టర్‌గా విధులను నిర్వహిస్తున్నాను. మా బ్యాచ్ వారంతా దాదాపు 121 మంది వివిధ కేటగిరిలలో స్థిరపడ్డారు. ఈ గెట్ టుగెదర్ ద్వారా దాదాపు 86 మందితో కలవడం ఆనందంగా వుంది. భవిష్యత్తులో కడప రిమ్స్‌కు, విద్యార్థులకు ఎంతో సహకరిస్తాం.

\- డాక్టర్ ఎం.శరణ్‌కుమార్‌రెడ్డి, 2కె7 బ్యాచ్

ఇక్కడే విధులు నిర్వహిస్తున్నా



కడప రిమ్స్‌లో 2కె7 బ్యాచ్‌లో ఎంబీబీఎస్ చేరి వైద్య విద్యను పూర్తి చేశాను. కడప రిమ్స్‌లో ప్రస్తుతం ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులను నిర్వర్తిస్తూ, బ్లడ్ బ్యాంక్‌లో మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాను. ఇక్కడే చదివి, ఇక్కడే విధులను నిర్వర్తించడం, పేద ప్రజలకు వైద్య సేవలను అందించడం ఎంతో ఆనందంగా వుంది.

\- డాక్టర్ ప్రవీణ్

వైద్య వృత్తిలో రాణిస్తున్నా..



మాది తిరుపతి. మా అమ్మానాన్నలు డాక్టర్ శ్రీహరిరావు, డాక్టర్ మారుతిలు వైద్యవృత్తిలోనే పేరు తెచ్చుకుంటున్నారు. వారి ప్రోత్సాహంతోనే కడప రిమ్స్‌లో 2కె7 బ్యాచ్‌లో ఎంబిబిఎస్ విద్యను అభ్యసించేందుకు చేరాను. తిరుపతి స్విమ్స్‌లో ట్రామా అండ్ అర్థోపెడిక్స్ విభాగంలో పీజీ వైద్య విద్యను పూర్తి చేశాను. ప్రస్తుతం బెంగుళూరులోని సంజయ్‌గాంధీ ట్రామా అండ్ అర్థోపెడిక్స్ కేర్ హాస్పిటల్‌లో కన్సల్టెంట్‌గా పని చేస్తున్నాను.

\- డాక్టర్ బి.అపర్ణ